# అహల్య

వడ్డెర చండీదాస్



ఎదురుగా కనిపించే టీ కొట్లోకి అప్పుడే వచ్చిన రంగడి కూడా వచ్చిన వాడి పెళ్ళాం మంగకేసి చూస్తూ మధ్య మధ్యలో చిలుందమ్ము లాగుతున్నాను. 'గురూ' అని చిట్టిగాడు అనటంతో వాడికేసి చూశాను. వాడు, అప్పటికి కాసేపట్నించి నన్ను ప్రత్యేకంగా గమనిస్తూ వుండివుండా లనిపించింది.

'యీ రంగడుగాడు - గురో - మంగి నెంపెట్టు కెప్పుదొచ్చినా ఆ జోగులుగాడు అళ్ళకి డబ్బు తీసుకోకుండానే టీ నీళ్ళోత్తాడు. గురో_యెదయిన గొడ్డుకి మల్లే దానెంక సొంగకారుత్తూ సూత్తాడు. యీళ్ళని సూత్తాంటే నా కేమనిపిస్తుందో తెల్సా గురో-మనకూ్కడా పెళ్ళాలుంటే టీవీళ్ళకి అవత్తపడాల్సి రాకపోను గదాని ...'

చిట్టిగాడు యేవేంవిటో చెప్పుకుపోతున్నాడు. నా కవేవీ వినిపించటం లేదు. నా గుండెలో యెవడో చెయ్యేసి కెలికినట్లయింది. భారంగా అనిపించింది.

'యేంటి గురో-అట్లా వుండావ్....'

తల విదిల్చి, నవ్వి, 'చిట్టీ నీకో కథ చెప్పనా' అని నేనంటూండగా చిట్టిగాడు పకపకా నవ్వుతున్నాడు. చిలుం వాడికిచ్చి, 'చిట్టిగా, యీ బైరాగిముండా కొడుకు కథలేం చెప్పగలడని-అనుకుంటున్నావ్ కదూ? లేదురా - యివాళ కథ చెప్పగలను. ఎందుకంటే, అది కట్టుకథ కాదు. నా సంగతి'—అని; సత్రవ మెట్లమీద అడుక్కొచ్చిన బియ్యంగట్రా గుమ్మరించి వేరు వేరుగా చేస్తున్న సత్తిరాజుకేసి చూస్తూ—

'అప్పుడు అది జరిగినప్పుడు ఆ ఐడియా వొచ్చిందని తెలువదుగానీ; ఆ తరువాతొకసారి ఏవైందనుకున్నావ్— యెప్పుడని? యీ బైరాగి బతుకు రాక ముందు, సావర్ల కోటలో షావుకారు భద్రయ్యాని చంపటంలో పాలుపంచుకోక ముందు, దొంగసారా మొయ్యకముందు, కాలేజీ అమ్మాయిల తార్పుడు పని చెయ్యకముందు, జేబులు కొట్టడం మొదలెట్టక ముందు 'తణుకులో కాయ్ రాజా కాయ్' నడపక ముందు, రాజమండ్రిజైలు సందర్శించుకోక ముందు - యేలూళ్ళో కలెక్టరాఫీసులో గుమాస్తాగా పనిచేస్తున్న రోజుల్లో సంగతి. యివన్నీ నీకు తెలిసినవేగానీ నేను గుమాస్తాగా వుండేవాణ్ణని నీకు తెలువదు. యివన్నీ వొక యెత్తు; ఆ గుమాస్తా జీవితం వొకటే వొక యెత్తు.

'వూళ్ళో వారం రోజులపాటు యేదో యెగ్జిబిషన్ పెట్టారు. అహల్య పోరు పెట్టగా; వొకరోజున తీసికెళ్లాను. కొట్టు ముందు వేళ్ళాడదీసిన చీరలకేసి అహల్య చూస్తూవుంటే; నేను కొంచెం అవతలగా నుంచునిపోయాను. అటు నుంచి రఘురాంగా రొస్తుంటే, నేను 'నమస్కారం సార్' అన్నాను. రఘురాం పిఠాపురంలో ఆర్డీవోగా పన్జేసి, యిక్కడికి కలెక్టరికి పి.యె.గా వొచ్చాడు. రఘురాం తల పంకించి అడుగు వెయ్యబోతుండగా— 'యేవండీ' 'యేవండీ' అంటూ సుడిగాలిలా వచ్చిన అహల్య; నా పక్కన మరో వ్యక్తిని చూసి ఆగిపోయింది. అతను అహల్యకేసి చూసి, 'యేవోయ్ సుబ్బారావ్, యెగ్జిబిషన్ చూడ్డానికొచ్చావా!' అన్నాడు సాదరంగా.

'అవున్సార్___' అని నేనేదో చవు ల్తోంటే; అతను తన చూపులు నామీంచి అహల్య మీదకి మరల్చి 'యెవరు' అన్నట్లుగా నాకేసి చూశాడు!

'యస్సార్, నా మిసెస్-మాడాలవి ముచ్చటపడితే___' అని, మిగతా మాటలు నోట్లోనే నాన్చాను.

'గుడ్!' అని చీర్‌పుల్‌గా అంటూ వెళ్ళిపోయాడు.


'యెవడు వాడు? యేదో చుట్టరికం వున్నట్లుగా చూస్తాడు నాకేసి?' అంది కోపంగా.

'చుట్టరికం లేకపోవటమేంటి: వాడి దగ్గర పన్జేసే గుమాస్తా పెళ్ళానివి గదా నువ్వు!'

'మీ ఆఫీసరా?' అని ఆశ్చర్యంగా చూసింది. అందులో ఆఫీసరంతటివాడు తనకేసి ప్రత్యేకంగా చూసినందుకు తనకి యేదో తృప్తి కలిగినట్లు అని పించింది. నాకు మండింది.

చీరా జాకెట్టూ నిక్కరుబట్టా లాంటి వెలాగూ కొనే ప్రసక్తి లేదుకాబట్టి.... రెండు అల్యూమినియం కూరగిన్నెలు, ఒక గరిటా లాంటివి కొనిపించాక.... అహల్యతో యింటికి చేరుకున్నాను.

అలా మా బీద గుమస్తా దంపతుల్ని చూసిన రఘురాంకి, నేనంటే జాలి కలి గుండాలి. ఆఫీసుకి కాస్త ఆలస్యంగా వెళ్ళినా, వర్డీకి డబ్బిచ్చినవాడు వాస్తే బయటికి వెళ్ళి వాడితో వొక గంటసేపు వేగొచ్చినా కరిచేవాడుకాడు. యింటికేవో ఫైళ్ళు తెమ్మంటే, తీసుకెళ్ళినప్పుడు కాఫీ యిప్పించేవాడు. వొకసారి అడి గాడు, 'నువ్వుండేది యెక్కడోయ్?' అని. చెప్పాను. 'ఆహా, ఆ వెనకవీధిలో కంట్రాక్టరు శంకరయ్య ఇంటికి అప్పు డప్పుడూ వొస్తూ వుంటాను. అటు ప్రక్కన నువ్వెప్పుడూ కనిపించలేదు. కనిపిస్తే మీ యింట్లో కాఫీ తాగిపోయే వాణ్ణి సుమా!' అని, సన్నగా నవ్వాడు.




అంత దయ వుండాలేగానీ - యీసారి- తమరు దయచేస్తే నా భాగ్యంగా భావి స్తాను' అని అన్నాను. 'వూఁ, రేపు ఆది వారం సాయంత్రం శంకరయ్య రమ్మని యిన్‌వైట్ చేశాడు వీలయితే వాపసులో వొస్తాలే....' అని అన్నాడు.

ఆ ఆదివారం సాయంత్రం యేడు గంటలకు వొచ్చాడు. అహల్య అందించిన కాఫీ తాగుతూ, 'మీ ఆవిడ కాఫీ బ్రహ్మండంగా చేస్తుందోయ్!' అని మెచ్చుకున్నాడు.

చింపిరిజుట్టుతో, చిదుగుల మురికి బట్టల్తో లోనకొచ్చిన నాలుగేళ్ళ మా అబ్బాయినీ రెండేళ్ళ అమ్మాయినీ చూసి- వెళ్ళబోతూ, గుమ్మం దాటాక, 'యేవి టోయ్ సుబ్బారావ్, పిల్లల్ని మరీ అంత అధ్వాన్నంగా పెంచుతున్నావేంటి?' అన్నాడు. అప్పటికి, 'యేవని చెప్పేది సార్,' అని వూరుకున్నాను గానీ-ఆ తరువాత; ఆర్నెల్లు నేను ఇబ్బొపడి నప్పుడైన రెండువేల అప్పుమీద పెరిగే వడ్డీ, నెలలో చివరి పదిహేన్రోజులూ యెలా గడపాల్సివొచ్చేదీ చెప్పాను.

ఆ తరువాత వొకరోజున తను వూరికి వెళ్ళబోతూ, బ్యాంకు చెక్కు యిచ్చి క్యాషుచేసుకు రమ్మన్నాడు. తెచ్చి యిచ్చాక, అందులోంచి రెండు వంద రూపాయల నోట్లు తీసి నాకిచ్చి, 'కన్నం దుకు; పిల్లలకి కాస్త శుభ్రమైన బట్ట లైనా కుట్టించకపోతే నేరవోయ్. వుంచు - తరువాత తీర్చుకుందువులే' అన్నాడు. ఆ డబ్బుతో పిల్లలకి తలా రెండు జతలు' అహల్యకి రెండు మంచి చీరలు, నాకో ప్యాంటూ షర్టూ తీశాను.

రెండు నెలలు గడిచాక, జనవరి ఫస్టున సాయంత్రం వొచ్చాడు, 'హాపీ న్యూ యియరోయ్ సుబ్బారావ్, మన వందరం కొత్త సంవత్సరంలో కులా సాగా కొత్త జీవితం ప్రారంభించుదాం.' అని గలగలా నవ్వాడు. నేనూ పళ్ళికి లించాను.

అంతలో అహల్య కాఫీ తీసు కొచ్చింది. అసలే బహు అందంగా వుంటుందేవోఁ, ఆ కొత్త చీరలో యెలా వుందనుకున్నావ్!

అహల్య కప్పు అందిస్తోంటే-చెయ్యి చాపి, 'యిదేవిఁటమ్మా కురుపూ-'అంటూ ఆమె ముంజేతిమీద లేచిన పొక్కు- పక్కగా వేలు అన్చాడు. కప్పూ సాసరూ కిందపడి, కాఫీ చింది అతని తెల్లని వులెన్ ప్యాంటుమీద మరకలుపడ్డాయి. రవంత తీక్షణంగా చూశాడు నాకేసి.

'వెధవ వ్యోటిచేతులూ నువ్వూ-ఛ.' అని అహల్యమీద విరుచుకుపడ్డాను. 'పోన్లేవోయ్.' అని; అంతలోనే జేబులు

తడువుకుంటూ 'అరె, సిగరెట్స్ మర్చి పోయినట్లున్నాను' అన్నాడు. 'తెప్పించుతా నుండండి సార్' అని మా వాణ్ని పిలిచాను. 'లేడు! ఆడుకోటానికెళ్ళాడు' అంది. అప్పటికే వంటగదిలోకి వెళ్ళిన అహల్య. 'పర్లేదులే, వెడుతున్నాగా బజార్లో తీసుకుంటాను.' అని అన్నాడు. 'అయ్యో! కాఫీ ఐనా యివ్వండే - నిమిషంలో తీసుకొస్తాను' అని గుమ్మంవైపు తిరుగుతూంటే, 'యిదో, సుబ్బారావ్-' అన్నాడు. వెనక్కి తిరిగాను. పది రూపాయల్నోటు తీసి, 'గోల్డ్‌ఫ్లేక్ తప్ప నడవదోయ్, మనకి. యీ వీధిలో దొరుకుతాయా!' అన్నాడు. 'యెంత సేపు సార్; సెంటర్లో పట్టుకొస్తాను.' అని వెళ్ళబోతూంటే; 'యిది పట్టికెళ్ళవోయ్' అని నోటు యివ్వబోతూంటే, 'యెందుకులే సార్-' అని తీసుకున్నాను. అవతలి గుమ్మంవైపు తిరిగి, 'అహల్యా నేను సిగరెట్లు తీసుకొస్తాను, ఆ లోగా కాఫీ చేసివ్వు, బాబుగారికి.' అని వడివడిగా వెళ్ళిపోయాను.

తిరిగి వొచ్చేసరికి పాతదేదో తెలుగు వారపత్రిక చూస్తూవున్నాడు. యెదురుగా ఖాళీ కాఫీ కప్పు.

సిగరెట్ ముట్టించాడు. 'అహల్యా కప్పు తీసుకెళ్ళు' అని అన్నాను. 'పర్లేదులే. వుణ్నీ,' అని అన్నాడు. అహల్య రాలేదు. సిగరెట్ కాలుస్తూ, ఆఫీసులో గుమాస్తాల గురించి మాట్లాడుతూ, 'నీలాగా సిన్సియర్‌గా పనిచేసే క్లవర్ గైస్‌కి ప్రమోషన్ రాకపోతే అన్యాయంవోఁయ్-' అని అన్నాడు. 'మీ దయ వుంటే అదెంత భాగ్యం సార్,' అని అన్నాను సంబరపడుతూ.

వెళ్ళబోతూ, గుమ్మంలో ఆగి, 'చదువుకున్నవాడివి, మీ ఆవిణ్ని మరీ అంత వోల్డ్ ఫేషన్డ్‌గా వుండాలేవోఁయ్' 'అన్నాడు. 'యేదో లేనివాళ్ళం సార్.' అని అన్నాను .... 'భావాలకి కూడా పేదరికమేవిఁటోయ్—కాగా, రేపు నీకు ప్రమోషనొస్తే, నీది రాజాబ్రతుకవుతుంది' అని వెళ్ళిపోయాడు.

అనక కంచంముందు కూచుని 'యేం, అలా వున్నావేం, అహల్యా?' అని సాదరంగా అన్నాను; ముఖం మాడ్చుకుని వున్న అహల్యకేసి చూసి. బడబడమని మాటలురిమింది. కాఫీ కప్పు తీసుకెళ్ళే మార్చోమని, ఆజ్ఞాపించినట్లంటాడేవిఁటి; వాడు ఆఫీసరు నీకా నాకా! వాడి మొహం మండ, యేంటలా చూస్తాడు నా వంక?'

నేను మౌనంగా వుండిపోయాను రెణ్ణిమిషాలయ్యాక, 'ఆ వెధవని యింటికి పట్రాకండి,' అంది ఆజ్ఞాపిస్తున్నట్లు.

'నేనేం పిలుమకురావటంలేదు. అంత పెద్దాఫీసరు రావటమంటే-'

మరో రెండు వారాల తరవాత, వో రోజు రాత్రి తొమ్మిది గంటలకి వొచ్చాడు. కాసేపు అవీ యివీ మాటలు, కాఫీ. అంతలో సీరియస్‌గా ఐపోయి - 'యీ పూట మూడ్ బావులేదోయ్' అని దిగులుగా ముఖం పెట్టాడు....

'మీకేం లోటు సార్-'అన్నాను.

'అఫ్‌కోర్స్, నాకేం లోటుండి-వెధవది మూడ్ బావులేదోయ్ .... రెండు పెగ్గులు పుచ్చుకుంటే తప్ప-'

'తీసుకొచ్చేదా సార్-'

'వూఁ -వుఁ. కొనుక్కొరానక్కర్లేదులే; కార్లో వుంటే చూడు.'

వెళ్ళి తీసుకొచ్చాను, కార్లోంచి. రెండు ప్లేట్ల బిరియాని తెప్పించమన్నాడు. వెళ్ళి, అదీ సోడాలు తీసుకొచ్చాను.

కాస్త పుచ్చుకున్నాక, మాంఛి జోరుగా మాట్లాడుతూ నన్నూ పుచ్చుకోమన్నాడు. అలవాటు లేదన్నాను. 'పుడుతూ యే అలవాటూ వుండదోయ్; అవసరాన్ని బట్టి చాలా అలవాట్లు అలవరచుకుంటాం. యిదేం చెయ్యదులే. జెస్ట్ ఫర్ కంపెనీస్ సేక్,' అని వొత్తిడి చేస్తే కాస్త పుచ్చుకున్నాను, భయం భయంగా. మరి కాస్త పోశాడు. కాదంటే, బాగోదని తాగేశాను. ఆ తరవాత నేనే పోశాను, తనకి. సగం పైగా నేనే ఖాళీచేశాను. యెప్పుడో సోలిపోయి —మెలుకువ వచ్చేసరికి; లోన వంట గదిలో యేడుస్తున్నట్లుగా సన్నగా అహల్య గొంతు వినిపించింది. అప్పటికి మత్తు వదిలింది. పాపం, యిలాంటి జాతర అహల్యకి అనుభవంలో లేదు- అసహ్యంగా అనిపించిందేవోఁ - అనుకుంటూ లేచి వెళ్ళాను.

చీరా లోపావడా బ్లౌజూ - అహల్య వొంటి మీద కుప్పలా సరుచుకుని వున్నాయి. నేను రావటం చూసి కనురెప్పలు వాల్చింది. తడి బయటి కుబికింది.

మౌనంగా గదిలోకి వొచ్చి, కిందికి వొరిగి, గచ్చుకేసి తల బాదుకుంటూంటే -నా బుష్షర్టు జేబులోంచి వందరూపాయల నోట్లు నేలమీదికి జారాయి.

* * *

పాత అప్పులు తీర్చాను గానీ కొత్త అప్పులు మొదలయ్యాయి. అలవాట్లూ అవసరాలూ పెరిగాయి. నాలుగ్గదుల మంచి యిల్లు వందరూపాయల అద్దెకి తీసుకున్నాను. యిందుకూ అందుకూ అన్నింటికీ అలవాటుపడ్డాను.

యెనిమిది నెలలకి, రఘురాంకి అనంతపూర్ బదిలీ ఐంది. వెళ్తూ రెండు మూడు నెలల్లో నాకు ప్రమోషన్ ఆర్డర్స్ వొస్తాయని చెప్పాడు. నాలుగు నెలలకి తెలిసింది నా కాన్ఫిడెన్షియల్ ఫైల్లో, యితనిది పై అధికారిని పతనంచెయ్యటానికి వుచ్చులుపన్నే స్వభావం - అని,

అప్పటికే కలర్ మందూ, బజారు ఆడదీ, నేను మానుకోలేని అలవాట్లు అయ్యాయి. యింటి అద్దె, బట్టా, తిండీ ఖర్చూ పెరిగింది. అప్పు పదివేలదాకా పెరిగింది.

ఆఫీసర్లంటే నాకు అసహ్యంవేసింది. కాగా, యే వెధవ యెన్నాళ్లుండేదీ తెలవదు. ఆఫీసుకి తిన్నగా వెళ్ళే అలవాటు తప్పిపోయి, ఫైలు వర్కు చూసి చాలా కాలమైపోయింది కొత్తగా వొచ్చిన ఆఫీసరు కరవటం మొదలెట్టాడు. చెడామడా తిట్టేశాను. యేవేవో ఛార్జెస్ ఫ్రేం చేశాడు. అది పుచ్చుకోకముందే, రాజీనామా కాగితం వాడి మొఖాన విసిరి కొట్టాను.

మరెప్పుడూ ఆఫీసర్ల జోలికి పోలేదు. కంట్రాక్టరు శంకరయ్యా మునిసిపల్ ఛెయిర్మన్ నరసయ్యా — అప్పులు తీరక పోయినా, ఐశ్వర్యం పెరుగుతూనే వుంది. మోటారుసైకిళ్ళు యెందరికి లేవని! ఐనా నన్నొక్కణ్నే, మోటార్ సైకిల్ సుబ్బారావుగారూ—అని పిలుస్తారు, అందరూ.

అహల్య, యింటిగుమ్మం దాటిగానీ, నాతో మాట్లాడిగానీ చాలాకాలం ఐంది. యింట్లోనే నికరంగా వుండే వంటమనిషి, పనిమనిషి అన్ని పనులూ చూసుకుంటారు. నేను రాత్రుళ్ళు యింటి కొచ్చేసరికి మూడో నాలుగో అవుతూ వుంటుంది. మనసు పుడితే అహల్య గదిలోకి వెళ్తాను. నిద్రపోతూవుంటుంది వొంటిగ వుంటే ఆమె దగ్గరకి చేరుకుంటాను. మెలుకు వొచ్చినా రానట్లే వుండిపోతుంది. యెప్పుడైనా రెప్పలు విప్పుతుంది. పీలగా సన్నగా బలహీనంగా చప్పుడు చెయ్యని దరహాసరేఖ—అప్పుడైతే నా శ్వాసలోంచి వొచ్చే విస్కీ వేడికి కరిగిపొయేదిగానీ; యిప్పుడెప్పుడైనా గుర్తుకొస్తే - ఆనాడు భద్రయ్య గుండెలో దిగిన చురకత్తికంటే పదునుగా నా నరనరంలోంచీ చీరుకుపోతున్నట్లు, నాలోకి దిగబడుతుంది.

పదిహేను రూపాయలకి చీర తెస్తే పొంగిపోయి నా మెడచుట్టూ చేతులువేసి నన్నుక్కిరిబిక్కిరి చేసే అహల్య—ఐదు వందలకి టిష్యూ చీర తెస్తే, కిందివాడికి పనికిరాదని రూఢిగా తెలిసిన పేక ముక్కను పారేసినంత లాఘవంగా లైట్‌గా, చూపుడు బొటనవేళ్ళతో యెత్తి బల్లమీదకి జార్చేది. యిప్పుడనిపిస్తుంది— అలా తను యెత్తిపారేసిందీ తీసిపారేసిందీ నన్నేనని. గుర్తొచ్చినప్పుడు - ఆ అపహాస్యం కురుపులా సలుపుతుంది.

ఒకరాత్రి యెప్పటిలాగే మూడున్నర తరవాత వొచ్చి మనసు పుట్టి, తన గదిలోకి వెళ్ళాను. మంచంమీదికి జరుగుతోంటే, కళ్ళు తెరిచి, 'వొద్దు' అన్నట్టుగా చేత్తో ఆపింది. కొత్తలో సీట్ పుచ్చుకుంటే గొంతు కాలినట్లు! నాకు గుండె మండిందనుకో. కళ్ళతో తీక్షణంగా చూశాను. 'ప్లీజ్—' అని చూపు మరల్చింది. 'యేం కత?' అన్నాను. 'ప్లీజ్ - నాకు జ్వరంగా వుంది.' అని అంది. 'యేం అర్ధరాత్రిదాకా వుండెళ్ళిన ఆ వెధవైతే జ్వరం లేదా?' అన్నాను.

అంతలో ధభీమని వెనక్కి విరుచుకు పడ్డాను. యెత్తి నా ఛాతీమీద బలంగా తన్నిన తన కాలు పరుపుమీద ఆన్చి, లేచి కూచుంది.

అప్పుడు నా వంక తను చూసిన చూపు, యీ గుంటూరు కారంకంటే యెర్రగా మంటగా వుంది. ఆ మంటకి నాకు మరింత మండుకొచ్చి, 'వోసి లంజా—' అంటూ లేవబోయాను. ఛెంగున మంచంమీంచి గెంతి, నా ఛాతీమీద కాలువేసి నొక్కింది.

మొదట్లో రఘురాం విషయంలో మూర్ఖంగా క్రూరతనం పోతే; మందు కొచ్చి నాలుగతికితే చచ్చినట్లు నోరు మూసుకుని పడివుండిన ఆ అహల్య— యేం తోచక, యేమీ స్ఫురించక; దిగ్భ్రమగా అలా నిశ్చేష్టంగా చూస్తూ వుండిపోయాను.

'నాకు జ్వరం లేదు. జలుబు లేదు. రోగం లేదు రొష్ఠు లేదు, విచారం లేదు, ఆకలి లేదు, ఆవేదన లేదు, ఆరోగ్యం లేదు, ఆనందం లేదు, కోపం లేదు కరుణ లేదు, కాఠిన్యం లేదు, దీనత్వం లేదు, బాధ లేదు, సుఖం లేదు, మనసు లేదు, వొళ్ళు లేదు, చీమూ నెత్తురూ లేదు. సిగ్గూశరమూ లేదు. నీతినియమమూ లేదు, మొగుడు లేడు, పిల్లలు లేరు, వీడు లేడు వాడు లేడు — తెల్లటి శరీరం వుంది. తులం యింతకీ అని అమ్ముతాను. కొంటావా, కొనగలవా చెప్పు? తీయ్, వెయ్ రూపాయలు తీసి యిలా పారెయ్; కుక్కలా నీకు లొంగిపోతాను - యెందుకు? ఆ వెయ్యి రూపాయలూ నీ మొఖాన కొట్టటానికి, నీ పేకాటలకీ, నీ తాగుడికీ, నీ ముండలకి తగతెయ్యటానికి. నీ దగ్గిర నోరెత్తకుండా ఎందుకు పడివున్నానో తెలుసా? నా బిడ్డలకోసం. కానీ యీ వాతావరణంలో పెరుగుతున్న ఆ బిడ్డలు నీకంటే ఘనులు కాగలరనీ, నా చెయ్యిదాటిపోయారనీ యిప్పుడిప్పుడే తెలుస్తోంది. యెవ్రా లంజ! నేనే లంజనైతే నువ్వు బజార్లో అడుక్కుతింటూ కుక్కకంటే హీనంగా చచ్చుందువు. యీ యిల్లూ, యీ సామానూ, యీ నగలూ, బట్టలూ, యీ పిల్లలూ నీ అప్పులూ—అన్నీ నియ్యే! నేను తప్ప—నువ్వే—నువ్వే—నిన్ను కుక్కా అని పిలిస్తే విన్న కుక్క నిలువునా కుచించుకుపోతుందిరా! డాఫర్. లోఫర్— నువ్వే—నువ్వే నువ్వు కుక్కా పందీ, చుంచూ యెలకా నక్కా పురుగూ కుమ్మరిపురుగూ పేడపురుగూ....?

ఆ మాటల వుప్పెనలో మునిగిపోయిన నేను ఆమె యిల్లువిడికి వెళ్ళటం గమనించనేలేదు.

---

యువ 1974 దీపావళి ప్రత్యేక సంచిక నుంచి